# అదేం మనిషో, అదేం లోకమో!

**ఏది మంచి, ఏది చెడు? ఇది సంస్కారానికి సంబంధించిన ప్రశ్న. డబ్బుతో కలుషితమవుతున్న కుటుంబ సంబంధాల నడుమ దీనికి సమాధానమేమిటి?**

"ఎవరూ, నువ్వు గోపీగాడివి కదూ" అని అరుగుమీది కళ్ళజోడుగాడు ఆరా తీస్తే, "ఆరి చిదంబరం, నువ్వట్రా" అంటూ నా బొక్కినోరు మరింత వెడల్పయింది.

యాభయ్యేళ్ళ మా స్నేహం, ఎన్ని నెమరు వేసుకుంటే తృప్తిపడను! అయినా, ఎక్కడున్నా వాణ్ణి పట్టివ్వడానికి ఓ నులువు ఉండనే ఉంది.

'ముక్కోటినాడు పుట్టేనట' అనేవాడు చిదంబరం. "బహుశా ఒక్క ముక్కుతోటే పుట్టి ఉంటావు" అనేవాళ్ళం వాడి దీర్ఘ నాసిక పసిగట్టి. అనుకున్నది తక్షణం ఆచరణలో పెట్టే సాహసానికి సూదిముక్కు ఓ ప్రతీక అంటారు. నిజమేనేమో అనిపిస్తుంది వాడి జీవితాన్ని పరిశీలిస్తే.

ఆనాటి కాకినాడ పి.ఆర్. కాలేజీలో ఇంటర్ క్లాస్‌మేట్స్‌గా మా తొలి పరిచయం. మేమందరం హాస్టల్లో ఉంటే వాడూ, వాళ్ళ మేనత్తా వేరే చిన్న వాటాలో ఉండేవారు. నేనెప్పుడు వెళ్ళినా ఆవిడ నోట తిట్ల దండకమే వినపడేది.

"మనుషులే పడని వాడికి తిండి పడిచస్తుందా? అగ్ని అనేది గర్భకుహరంలో ఉండాలిగాని మెదడుని చీటికీ మాటికీ వేడెక్కించేస్తుంటే తిన్నది జీర్ణం అవుతుందాంట. ఇలాంటి మొండిఘటంతో మీరంతా ఎలా సర్దుకుంటున్నారో ఏమో. వాడి రుచులకు తట్టుకుని వండి వడ్డించలేక నా ప్రాణాలు పోతున్నాయి బాబూ."

చిదంబరం ఓ పట్టాన నలుగురిలో కలిసేవాడు కాదు. ఎప్పుడైనా నోరు విప్పితే నాతోనే. ఎందర్లో ఉన్నా వాడి ప్రత్యేకత వాడిదే. చదువు పూర్తయి, పెళ్ళయి ఉద్యోగం వెలగబెట్టే రోజుల్లో అయినా అది తగ్గాలంటారా? ఉహూఁ, వాడిలో అది పెరుగుతూనే వస్తోంది. ఏదైనా చెబితే నాతోనే చెప్పేవాడు. అంతే. అందుకే వాళ్ళ నాన్నగారైనా నాముందే గోల పెట్టేవారు.

"చూశావటోయ్ గోపీ, మీ ఫ్రెండ్ చేసిన నిర్వాకం? ఇంకా పెళ్ళయి ఏడాది అయిందో లేదో ఉన్న ఊళ్ళోనే వేరింటి కాపురం పెట్టేటంత ఘనుడై పోయాడు."

ఆశ్చర్యంతో నా నోట మాట రాలేదు. వాళ్ళమ్మగారు ఆమధ్యనే పోయారని విన్నాను. ఆవిడ అస్తమానూ ఏదో రోగంతో తీసుకునేది. వాళ్ళక్క శాంతమ్మగారు కాబోలు ఇల్లు చూసుకునేది.

చిదంబరమూ, వాడి పెళ్ళామూ ఎప్పుడూ ఇంటి బాధ్యతను చేపట్టిన దాఖలాలు లేవు. ఇలాగైనా ఉండనీక వేరింటి కాపురమా?

"ఈ పల్లెటూళ్ళో ఇక నేనెలా తలెత్తుకు తిరగ్గలనయ్యా? మా కుటుంబం పరువు ఏం కావాలి" అని మొత్తుకున్నాడంటే ఆయన్దా తప్పు?

దానికి మా చిదంబరం జవాబేమిటో విన్నారా?

"అదే నేనూ ఆలోచిస్తున్నాను. వీలైనంత తొందర్లో ఈ ఊర్నుంచి ట్రాన్స్ఫర్ చేయించుకోవాలి మరి" అంటూ వాడు చెప్పిన సంజాయిషీ ఇది:

వీడి పెళ్ళినాటికే చిదంబరం భార్య టీచర్‌గా పనిచేస్తుండేది. పెళ్ళయ్యాక కూడా కొనసాగించింది. ఇద్దరూ ఎవరి ఉద్యోగాల్లో వాళ్ళు వీధినపడితే వాళ్ళమ్మగారు బతికున్నన్నాళ్ళు ఇంటిపని చూసుకొనేదట. ఆవిడ ఓ జబ్బుమనిషి కనుక వాళ్ళక్క తల చెడి అక్కడ చేరిన శాంతమ్మగారే అంత బాధ్యతా వహించేదట. మరంతకుముందే ఉందో, చెల్లెలు పోయాక అలా జరిగిందో, శాంతమ్మగారు మరిది పడక గదిలో కూడా స్థానం సంపాదించిందట! ఇదేంపని అని ఎవరైనా పరోక్షంగా అయినా నిలదీస్తే వాళ్ళనాన్న ముసిముసి నవ్వులతో దాటేసేవాడట. "నలభైఅయిదేళ్ళ నడివయస్సులోనే కట్టుకున్నది దగా చేసి తన దారి తాను చూసుకుంటే మగాడన్నవాడు ఏ సంబంధమూ పెట్టుకోక చస్తాడా" అనే బంధువుల తీర్పు వింటూ ఆ ఇంట్లో ఉండడం చిదంబరం భరించలేకపోయాడట. అందుకే మూటాముల్లే సర్దుకుని వేరైపోయారుట.

"ఒరే నీ ఇష్టం వచ్చినట్లు నువ్వు చేస్తావు కదా. ఆయన తంటాలేదో ఆయన పడితే మధ్య నీకెందుకు మంట? అయినా ఇంటికి పెద్ద కదా..."

"అలాంటి పెద్దల చిన్న బుద్ధుల్ని నేను భరించలేకపోయాను గనకనే..."

అయినా, వీడికి అక్కర్లేని గొడవంటూ లేదు. ప్లీడరుగా పేరు పొంది వీళ్ళ నాన్న చచ్చినంత ఆస్తి సంపాదించాడు. వీడా ఒక్కగానొక్క కొడుకు. లోకంలో అన్నీ మనకి కావలసినట్టే జరుగుతాయా, అందరూ మనం చెప్పినట్టే వింటారా? జన్మనిచ్చిన తండ్రి బలహీనతనే క్షమించలేకపోతే ఇక మనం ఏం సరిపెట్టుకోగలం, ఏం సుఖపడగలం?

నేనెన్నివిధాల చెప్పినా అది చెవిటివాడి ముందు శంఖం ఊదడమే.

"అలా సరిపెట్టుకోవడం నా దృష్టిలో కేవలం ఆత్మవంచనే. సుఖపడడం అనే మాటకి నా నిర్వచనం వేరు. అది నా తండ్రి విషయంలో అయినా ఒకటే, రేపొద్దున నా పిల్లల విషయంలోనైనా అంతే"

"చూద్దాంలే. రక్తం బిగి ఉన్నప్పుడు ఎన్ని శపథాలైనా చెయ్యొచ్చు."

"నువ్వే చూస్తావుగా" అనే ఎదురు సవాలే మా చిదంబరం గాడి రెడీమేడ్ జవాబు. రక్తం బిగి మాట దేవుడెరుగు గాని వాడి 'పంతం జిగి' మాత్రం ఎక్కడా చెక్కు చెదిరినట్లు లేదు. వేరే ఊళ్ళలో ఉద్యోగాల్లో స్థిరపడినా మంచికో చెడుకో అప్పుడప్పుడూ మేం కలుసుకుంటూనే ఉన్నాం. ఎప్పట్లా వాడి విశేషాలు నన్ను ఆశ్చర్యంలో ముంచి తేలుస్తూనే ఉన్నాయి. ఇంతకీ బాగా సంపాదించాడన్న మాట నిజమేగాని అంతకు మించిన అప్పులు కనిపించేయట, చిదంబరం నాన్న పోయాక చూసుకుంటే. ఉన్న ఇల్లూ, కాస్త పొలమూ ఆయన స్వార్జితమే గనుక సర్వహక్కులతో శాంతమ్మగారి పేర రాసేసి మరీ కన్ను మూశాడట.

"మీ పెద్దమ్మగారే మీ నాన్నగారికి మందో మాకో పెట్టి అంత ఆస్తీ రాయించేసుకుని ఉంటుంది. కన్న కొడుక్కి చిల్లిగవ్వ ఇవ్వకపోవడం ఎక్కడైనా ఎరుగుదుమా? మీరు కోర్టుకెక్కండి, ఊరుకుంటే లాభంలేదు" అని బంధువులు ఉసిగొల్పేరు.

"మనకి లేదని కాదు. అన్యాయం జరుగుతూ ఉంటే చూస్తూ కూచోడం అధర్మం. నువు వెంటనే ఓ కాగితం తగిలించు అల్లుడూ" అని మామగారు మరింత ప్రోత్సహించారు.

నిజానికి వాళ్ళ మామగారు చెప్పినట్లు చిదంబరం ఆర్థిక స్థితి ఒకళ్ళనుంచి రాబట్ట వలసిన పద్ధతిలో లేదు ఆనాటికి. చిదంబరం క్లాస్ వన్ పోస్టులో ఉన్నాడు. వాళ్ళావిడ హెడ్‌మిస్ట్రెస్ స్థాయికి చేరింది. ఒక్కర్తే కూతురు. హేమ అంటారు. ఎం.బి.బి.యస్ రెండో ఏడు చదువుతోంది.

దశాబ్దాలుగా మొగుడి మొండి వైఖరికి అలవాటుపడిపోయిన అతని భార్య చూడామణి ఎట్టి పరిస్థితుల్లోనూ సలహాలు ఇచ్చి ఎరుగదు. అతనెపుడూ ఎవర్నీ దేనికీ సంప్రతించడు. తాను అనుకున్నది చేయక మానడు. అందుకే ఆ రోజు "నేనోసారి పిఠాపురం వెళ్ళి పెద్దమ్మ వ్యవహారమేమిటో తేల్చుకుని వస్తాను" అని భర్త బయల్దేరుతుంటే మతిపోయినట్లు చూసింది.

అలా వెళ్ళిన పెద్దమనిషి వారం రోజులకి గాని తిరిగొచ్చి ఆఫీసు పన్లో జాయిన్ కాలేదు. అతను చేసుకొచ్చిన నిర్వాకం విని మరి ఆ పెళ్ళామూ, వాళ్ళవాళ్ళూ ఎలా తట్టుకున్నారోగానీ, సాటి స్నేహితుణ్ణి నాకే నోట మాట రాలేదు!

ఇంతకీ రెండోసారి వైధవ్యం అనుభవించినంత దుఃస్థితిలో ఉందట వాళ్ళ పెద్దమ్మ. మరిది ఆవిడ పేర ఆస్తినంతా రాసేశాడని తెలియగానే ఎక్కడెక్కడి చుట్టాలూ ఇల్లు నిండిపోయారట. ఇన్‌డోర్ వ్యవహారాలైతే ఎలాగో నెట్టుకొచ్చిందిగాని బయట ప్రపంచం తీరుతెన్నులెలాంటివో ఆవిడ ఎరగదట. ఏకాంతంగా వేరే పిల్చి అన్నీ చిదంబరానికి చెప్పుకొని గొల్లుమందిట.

"మీకు నేను చేసిన ద్రోహం చాలు. కన్నకొడుకువి, న్యాయమైన జ్ఞాతివి, నీకుగాక ఆయన రాస్తే రాశారు. ఈ పాపం ఇంకా ఇంకా నేను మూట కట్టుకుపోవాలా? వెంటనే నన్ను ప్లీడరు దగ్గిరకు తీసుకెళ్ళు. నీకెలా రావాలో ఆ ఏర్పాటు చెయ్యి. ఎక్కడ సంతకం పెట్టాలో చెప్పు. నన్నే కాశీకో పంపెయ్యి" అని బతిమాలిందిట.

ఆ రాత్రే ఆవిడకి చిన్న హార్ట్ ఎటాక్ లాంటిది వచ్చిందట. అంతకుముందే ఆవిడంటే ఎంతో ప్రేమ చిదంబరానికి. తల్లి సంకటం మనిషి గనక అతని ఆలనా పాలనా ఆవిడే చూసింది మరి. ఇంతకీ అతని కోపం వాళ్ళ నాన్న గారి మీద తప్ప అన్నేళ్ళ

చిదంబరం ఓ పట్టాన నలుగురిలో కలిసేవాడు కాదు. ఎప్పుడైనా నోరు విప్పితే నాతోనే. వాడి ప్రత్యేకత వాడిదే.

పాటు ఆ ఇల్లు నడిపిన పెద్దమ్మ మీద కానే కాదుగా!


"పెద్దమ్మా నేను ఏం చెబితే అలా చెయ్యాలి. కాదూ కూడదంటే నేను ఇప్పుడే వెళ్ళిపోతాను" అని ఆవిడ చేత ఒప్పించాడుట. ఊళ్ళో బాగా తెలిసిన ప్లీడర్ని కలిసి అతను అక్షరాలా అమలు చేసిన నిర్ణయాలు ఇవీ: ఆ ఇల్లు గాని, భూములు గాని వాళ్ళ నాన్నగారి స్వార్జితం. ఆయన వీలునామా ప్రకారం అవన్నీ పూర్తిగా శాంతమ్మకే దక్కుతాయి. తనకి గాని తన వారసులకు గాని వాటి మీద ఎలాంటి హక్కు లేదు. రెండో మేనమామతో సంప్రతించి వాళ్ళ ఆఖరబ్బాయి పదేళ్ళ శంకరాన్ని శాంతమ్మగారికి దత్తత ఇవ్వడానికి ఒప్పించడమే గాక, ఆ తతంగాన్ని దగ్గిరుండి రిజిస్టర్ చేయించాడు కూడా. ఇందులో ఎవరేం తలదూర్చి చిక్కులు పెట్టడానికి ప్రయత్నించినా ఓ కార్డు ముక్క రాస్తే చాలు తనొచ్చి సరిదిద్దుతానని పెద్దమ్మకి భరోసా ఇచ్చి మరీ రైలెక్కేడట చిదంబరం.

ఇదంతా ఓ ఘనకార్యమని చిదంబరం మురిసి పోవచ్చుగాని నాకేమంత సబబుగా మాత్రం తోచలేదు. ఆవిడ గారు తనంతట తానే ఒప్పుకుంది 'ద్రోహమని'. పోనీ అనుభవించినంతకాలం అనుభవించి తర్వాతైనా వీళ్ళ పేర రాసిమ్మంటే అదోరకం. ఈ దత్తత వ్యవహారం కూడా ఏమిటి? తనకీ ఓ సంసారముందనీ, బాధ్యత ఉంటుందనీ, మరచిపోతే ఎలా? ఇదెలాంటి వ్యక్తిత్వం? ఇద్దరూ నాలుగు చేతులా సంపాదించుకుంటూ ఒకే ఒక పిల్లనయితే కన్నారు గాని, నాలాంటి బహు కుటుంబీకుడైతే ఏమైపోవాలి?

చిదంబరం పెళ్ళాం గనక అన్నిటికీ మౌనంగా ఓర్చిందిగాని మరో ఆడదైతే ఈ పాటికే మొగుణ్ణి వీధిన పెట్టేసి జలకడిగేసి ఉండును. పాపం ఆ దొడ్డ ఇల్లాలు కొంగున అగ్నిహోత్రం కట్టుకుని ఇలాంటి తలపొగరుగాడితో ఇన్నేళ్ళపాటు ఎలా నెట్టుకొచ్చిందో? అందుకే ఆమెని ఆ దేవుడు చల్లగా చూసి ఉండాలి. కూతురు హేమకి చదువు పూర్తయింది. ఉద్యోగం కూడా అయింది. కలిగున్న ఇంట్లో మంచి హోదా గల ఉద్యోగం చేస్తున్న వరుడితో పెళ్ళి చేసింది. తన డ్యూటీ అయిపోయింది. ఇక ఈ రణపెంకి భర్తతో ఎన్నేళ్ళు కాపురం చేసినా ఒకటే. హాయిగా పసుపు కుంకుమలతో వెళ్ళిపోయింది, అదృష్టవంతురాలు.

అప్పటికి మా చిదంబరంగాడు రిటైరై ఏడాది దాటింది. పెద్ద ముక్కూ, దానికి తగ్గ ముక్కుసూటి వ్యవహారమూ గనక, పెద్ద ఉద్యోగం వెలిగించినా ఓ చిన్న కొంపైనా కట్టుకోలేదు. చేసిన గుప్త దానాలకు లెక్కాజమా ఎలాగూ లేదు. "వేరే ఏం మిగుల్చుకోలేదని నా కెందుకు దిగులు? సర్కారు ధర్మమా అని నేనెక్కడ ఉన్నా నెలకు మూడు వేలు పెన్షన్ రాళ్ళు చేతిలో పడతాయి. బక్క పేగుల వాణ్ణి, నేనెంతతిని చావాలి, నాకయే ఖర్చునగా ఎంత" అనే ధీమా ఉన్నవాణ్ణి ఎవరెదిరించగలరు? "మా దగ్గిరొచ్చి ఉండండి నాన్నా" అని కూతురూ అల్లుడూ వచ్చి బతిమాలితే తప్ప ఒప్పుకోలేదట అని ఎవరో చేరేసిన వార్త చెవిలో పడితే "దొరికావురా దొంగ" అనుకున్నాను కసిదీరా.

"ఎంతో బతిమాలితే తప్ప" అనే బోడి సంజాయిషీ కూడాదేనికి. వృద్ధాప్యం, ఒంటరితనం, అజీర్ణ రోగం అంటూ స్పష్టంగా ఒప్పుకోక. ఎవరైనా ఎప్పటికైనా పరిస్థితులతో రాజీపడక తప్పదు. రేపొద్దున్న నా పిల్లల విషయంలోనైనా అంతే అంటూ బీరాలు పలకడం కాదు. ఇన్నేళ్ళకు ఈ విధంగా మళ్ళీ కలుసుకున్నాం గనక మొహం మీదే అడిగెయ్యాలి వీడి పంతం ఏమైందో...



ఇన్నేళ్ళకు మళ్ళీ ఒకర్నొకరం కలుసుకున్నామనే ఆనందానుభూతితో మైమరచి ఏవేవో అనుకుంటున్నాను గాని కాస్త జాగ్రత్తగా పరిశీలిస్తే చిదంబరంగాడు ఇప్పుడున్నది వాడి అల్లుడి క్వార్టర్సు కానే కాదు.

వాడికి మాత్రం ఎవరున్నారు గనక, కూతురికీ, తనకీ మధ్య నడచిన వ్యవహారమంతా పూసగుచ్చినట్లు చెప్పుకొచ్చాడు చిదంబరం నాతో.

హేమ డాక్టరు. వాళ్ళాయన ఎలక్ట్రానిక్ ఇంజనీరు. ఏదో ప్రైవేట్ కంపెనీలో టెక్నికల్ కన్సల్టెంటు. మంచి క్వార్టర్సు కాక అన్నీ ఫ్రీ. పెద్ద హోదా. పెళ్ళైన అయిదేళ్ళ దాకా పిల్లలు వద్దనుకున్నారు గనక ఆ ఖర్చూ ప్రస్తుతం లేదు. మొగుడెవరికి పెట్టేస్తాడో అని చూడామణి గారు తాను సంపాదించిందంతా కూతురికే పెట్టేసింది. ఫర్నిచరూ, బంగారం, కాక.

"లోకం ఏమనుకుంటుందో అని నేనెప్పుడూ లెక్ఖ పెట్టింది లేదు. మీకెంత డబ్బున్నా నా ఖర్చు నేను పెట్టుకుంటేనే నాకు ఆనందం. నా కొచ్చిన పించన్లో నెలనెలా రెండు వేల తొమ్మిదొందలు మీకు ఇచ్చేస్తాను. అలా మీరు పుచ్చుకుంటానంటేనే మీ ఇంటికి వస్తాను" అనే నిబంధన పెట్టేడుట చిదంబరం, కూతురింటికి చేరడానికి.

"నాన్నా నీదంతా ఏకపక్ష వాదం. తాతయ్య ఆస్తంతా పెద్దమ్మమ్మకు కట్టబెడితే మేం ఎవరమైనా పల్లెత్తు మాట అన్నామా? నువ్వు అననిచ్చావా? తల్లిపోతే కనిపెంచిన కన్న తండ్రిని గాలికొదిలేసిందనే నింద ఈనాడు నాకెందుకు? మాకిద్దరికీ కలిపి కప్పెట్టనంత డబ్బుంది. నీ డబ్బు పుచ్చుకుని నీకు తిండి పెట్టవలసిన దుఃస్థితిలో మేంలేం. ఇదేమైనా నీకు న్యాయమా?"

"నీ విషయంలో న్యాయం ఇంకోలా ఉంటే నే చేసేది ఏమీ లేదు. అందుకే

చిత్రాలు: నర్సిం

అన్నీ ముందే స్పష్టంగా చెబుతున్నాను. నువ్వూ, అల్లుడుగారూ బాగా ఆలోచించుకుని దీనికి ఒప్పుకుంటేనే మీ గడప తొక్కేది."

అల్లుడి చేత కూడా అవునని పించుకుని మరీ చిదంబరం వాళ్ళ క్వార్టర్సుకి మారేడుట. చెప్పినట్లే నెలనెలా రెండువేల తొమ్మిదొందలు వాళ్ళకిచ్చేసేవాడట.


"ఆ మిగిలిన వంద నీ సొంత ఖర్చుల కోసం కాబోలు." అన్నాను.

"నాకేం కావాలో అన్నీ ముందుగానే వాళ్ళు అమర్చిపెడుతుంటే ఇంక సొంత ఖర్చులంటూ ఏం ఉంటాయి?"

"అయితే ఆ వందా ఏం చేసేవాడివి?"

"నీకు గుర్తుందా, ఆ రోజుల్లో, ఏది, మనం ఇంటరు చదువుకొనే రోజుల్లో నేను వేరే వాటా తీసుకుని ఉండేవాణ్ణి. అప్పుడు మా అత్త నాకు వండిపెడుతూ ఉండేది."

"నీకు వేళకు అమర్చలేకపోయానని గోల పెట్టేది కూడా"



అవును ఆవిడే. మానాన్నగారికి దూరపు కజిన్. ఏదో తప్పక ఆ రెండేళ్ళు ఆవిడ చేత చేయించుకున్నారు గాని మా నాన్నగారి తరఫువాళ్ళకెవరికీ మా అమ్మ పైసా పెట్టనిచ్చేది కాదు. మాట ఎంత పెళుసో మనసు అంత మృదువు మా మేనత్తకి. అసలే అర్భకుణ్ణి, ఆపైన ఎమ్‌బీయోసిస్ పట్టుకుని ఎంత బాధ పడ్డానో, ఆవిడ నన్నెంతగా కనురెప్పలా చూసుకునేదో నేనెప్పటికీ మరచిపోలేను. ఉన్న ఒక్క కూతురికీ పెళ్ళి చేసే స్తోమత లేక ఓ తాగుబోతు తమ్ముడికి కట్టబెట్టింది. వాళ్ళకీ పోలియో కూతురు పుట్టింది. ఇప్పుడా ముప్పై ఏళ్ళ అష్టనాకారాల రాముడమ్మ తప్ప వాళ్ళ వాళ్ళెవరూ బతికి లేరు"

"ఆ రాముడమ్మకి పెళ్ళయిందా?"

"అసలా ప్రసక్తికే అవకాశం లేదు. మా బంధువుల్లో అలాంటి అమ్మాయి ఒకర్తున్నట్లు నేను కనిపెట్టింది కూడా బాగా ఆలస్యంగానే. చిన్న కిరాణా కొట్టులాంటిది పెట్టుకుని ఎలాగో కష్టంమీద రోజులు ఈడుస్తోందిట. రెండేళ్ళుగా రాముడమ్మకే నేను నెలనెలా వంద చొప్పున పంపించేది." అంటూ తనకీ, హేమకీ ఎందుకు ఘర్షణ వచ్చిందో బయట పెట్టేడు చిదంబరం.

ఓసారి కూతురడిగిందిట, ఓ ఆర్నెల్లు గడిచాక కాబోలు.

"ఆ వందా ఏంచేస్తున్నావ్ నాన్నా?"

"రెండువేల తొమ్మిదొందలే వద్దన్నారు కాదుటే?"

"ఇప్పుడు మాత్రం కావాలనా? అవసరం వచ్చింది గనుక. మా కొచ్చిందాంట్లో నెలకో పదిహేను వేలు చీటీకట్టేస్తున్నాం కదా. అదిగాక మీ అల్లుడుగారు ఫైనాన్స్‌లో మారుతీ కారు తీసుకున్నారు. దానికో మూడువేలు తక్కువొచ్చింది. నెలనెలా తీర్చేది. నీ పెన్షన్ చెక్కు అలా ఇచ్చేస్తే నీ పేరు చెప్పుకొన్నట్లు అవుతుంది. ఏదైనా అప్పుగానే. నీ దగ్గిర ఇన్నాళ్ళూ ఎంతెంత పుచ్చుకున్నామో ఆయన ఎకౌంట్ వేస్తూనే ఉన్నారు. ఈ వయసులో నీకే పట్టుదల ఉంటే ఆయన కుండదా! ఒకళ్ళ సొమ్ము పైసా పుచ్చుకుంటే ఆయన పై ప్రాణం ఎగిరిపోతుంది. నేనూ అంతేనని నీకు తెలుసుకదా.

కాబట్టి పైనెల నుంచీ ఆ వందా కూడా ఇచ్చేస్తే...

తనిలా రాముడమ్మని ఆ సొమ్ముతో ఆదుకుంటున్నాని చెబితే హేమ పలికిన ఒక్కొక్క అక్షరం ముల్లులా దిగబడిందిట అతని మనసులో.

"ఇంకా ఎవరో అనుకున్నాను. ఆ ముష్టిముండ రాముడమ్మకా నువ్వు నెలనెలా వందేసి రూపాయలు పంపేది. ఇలా అయిన వాళ్ళకి ఆకుల్లోనూ, కాని వాళ్ళకి కంచాల్లోనూ ఎన్నాళ్ళు పెడతావ్ నాన్నా. అది మన దూరపు బంధువని చెప్పుకుంటేనే సిగ్గుతో తల వంగిపోతుందే! పేరుకి కిరాణా కొట్టుగాని ఆ రాముడమ్మే కిరాయికి దొరకుతుందని అందరూ చెప్పుకుంటారే!" ఇక కూతురితో వాదన ఎందుకనుకున్నాడో, ఏమో చిదంబరం రెండు చెవులూ మూసుకున్నాట్ట. అలాగని ఆ నెల వంద పంపడం మాననూ లేదట.

రెండోసారి కూడా హేమ గొడవ పెట్టక మానలేదు.

"నీ ధోరణి నీదే అనుకుంటే నే చెప్పలేను గాని నాన్నా, ఈ సంగతి తెలిసి మీ అల్లుడెంతో చికాకు పడుతున్నారు. పోనీ ఒకరి మాట ఎందుకు? మనమే ఆలోచిద్దాం. ఆ రాముడమ్మకి ఇంత పిసరు కృతజ్ఞత ఉందా? రోగంతో తీసుకుంటున్నావు. నీ డబ్బు తింటోంది. 'కులాసాగా ఉన్నావా' అని ఒక్క కార్డు ముక్క రాసిందా? అమ్మ పోయినప్పుడైనా నిన్నొచ్చి చూసిందా? బొత్తిగా పాముకి పాలు పొయ్యడం ఏమిటి నాన్నా"

ఈసారి కూడా ఇట్నించి ఉలుకూ పలుకూ లేదు. కన్న కూతురి మీద ప్రేమ చంపుకోలేక ఇంకో ఛాన్సు ఇద్దామనుకున్నాట్ట.

నెల్లాళ్ళు ఎంతలో గడవాలి?

"మీ అల్లుడేమన్నారో తెలుసా నాన్నా, 'పాపం ఏదో అమాయకత్వంలో పడిపోయి ముందే వాగ్దానం చేసేశారేమో మామయ్య. అనుకున్న ప్రకారం ఈ నెల కూడా పంపేసి చేతులు తుడిచేసుకుని ఉంటారు. ఆ మాత్రం సర్దుకోలేమా ఏమిటి. మనకేం లేదా పోదా' ఏం నాన్నా అంతే కదూ? వచ్చే నెల నుంచి మాకు అందేది రౌండ్ ఫిగర్ కదూ."

చిదంబరం కూతురి మాట ఓ విధంగా కరెక్టే చేశాడు ఆ పైనెల నుంచీ, 'రౌండ్ ఫిగర్' అంటే అతని దృష్టిలో సున్నా అని అర్థం. ఓ విధంగా కూతురిలా నిత్యం నిలదీయడమే అతనికి కనువిప్పు కలిగించింది. న్యాయమేదో చూపించింది. తాను తినడానికి ఖర్చు మహా అయితే తొమ్మిదొందలు అనుకుందాం. అంటే, తాను చేస్తున్నదేమిటి? నెలకి పాతికవేలు సంపాదించే వాళ్ళకు రెండు వేలూ, కిరాణా కొట్టు పెట్టుకుని గుట్టుగా తన మటుకు తాను బతుకుతున్నా, ఒళ్ళమ్ముకుంటోందని నలుగురూ ఆడిపోసుకునే ఓ పరమ నిర్భాగ్యురాలికి కేవలం వంద మాత్రమేనా? వీళ్ళ పంచ చేరినందుకు తన సొమ్ముతో తాను ఆమాత్రం ఖర్చు పెట్టుకోవడానికి కూడా స్వతంత్రం లేదా?

నిర్ణయం తీసుకున్నాక చిదంబరానికి మళ్ళీ వెనుతిరిగి చూసే దృష్టి లేదు. అతను కూతుర్ని వదిలేసి రాముడమ్మ పెంకుటిల్లుకి చేరి అంతా మూణ్ణెల్లు గడిచిందిట.

చిదంబరాన్ని నేనిప్పుడు కలుసుకున్నది రాముడమ్మ వీధి అరుగు మీదనేనట.

"ఏంరా, నేను చేసింది రైటా తప్పా" అని ఆ అహంకారి నన్నెప్పుడూ అడగడు. నేనేం చెప్పినా వాడెలాగా వినడు. పుట్టెడు కర్రలు తగలేస్తేగాని ఆ బుద్ధి మారదు. చాలా ఏళ్ళ కలుసుకున్నానని సరదా పడ్డానుగాని ఆ సంబరం నాతో ఆట్టేసేపు నిలబడలేదు. ఆక్కణ్ణుంచి కదిలిపోయేదాకా నా గుండె దడ వదల్లేదు.

పొద్దుట లేచి పాలప్యాకెట్లు తెచ్చింది మొదలు రాత్రి ఇంటి తాళాలు వేసేవరకూ చాకిరీ చేసినా కోడలి చేత దెప్పులు తినని రోజుండదు నాలాంటి ముసిలాడికి. అందరితో అమ్మా బాబూ అంటూ గడుపుతూ కృష్ణా, రామా అని ఓ చోట పడుండవలసిన రోజులు. నాకెందుకు బాబూ ఈ చిదంబరం లాంటి వాడి గోల. ఎంత స్నేహితుడౌగాక ఇలాంటి వాడితో ఇంతసేపు గడపడమే నాలాంటి అల్పజీవికి ఓ సాయుధ విప్లవం. ■

**చిదంబరానికి వెనుతిరిగి చూసే దృష్టి లేదు. అతను కూతుర్ని వదిలేసి రాముడమ్మ పెంకుటిల్లుకి చేరి మూణ్ణెల్లు గడిచిందిట.**